క్లుప్తంగా

అంతా ప్రశాంతం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఇరువర్గాలు

వి.కోట: గత రెండు రోజులుగా మండలంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తిన సంఘటన తెలిసిందే. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, ఎస్పీ మణికంట చందోలు, డీఎస్పీ ప్రభాకర్ చొరవతో వి.కోట మండలం ప్రశాంతంగా మారింది. రెండు రోజుల పాటు కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు, అన్ని పార్టీ నేతలు, మండల అధికారులు శాంతి కమిటీగా ఏర్పడి ఇరువర్గాలతో జరిపిన చర్చలు ఫలించాయి. దీంతో బుధవారం సాయంత్రం శాంతియుతంగా ఇరు వర్గాలు కలసి అంబేడ్కర్ సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ చేశాయి. ఈ సందర్భంగా ఇరువర్గాలు మనమంతా కలసి మెలసి రాష్ట్రానికే ఆదర్శవంతమైన మండలంగా తీర్చిదిద్దుదామని హామీలిచ్చుకున్నారు. ఇందుకు ఎస్పీ, కలెక్టర్, జిల్లా యంత్రాంగం, అధికారులు వారు చేసిన కృషికి మండల ప్రముఖులు ధన్యవాదాలు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

గంగవరం: మండలంలో ఎవరైనా ఇసుకను జేసీబీల సాయంతో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మండలంలోని కౌండిన్య నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇదివరకే అనుమతులు లేకుండా ఇసుకను తరలించిన టిప్పర్లు, జేసీబీని సీజ్ చేసినట్టు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

207 అర్జీల స్వీకరణ



అర్జీలు పరిశీలిస్తున్న కమిషనర్

కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరిధిలో మెదటి వార్డులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 207 అర్జీలు స్వీకరించినట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మెదటి వార్డులోని సామగుట్టపల్లి, తంజమ్మ కోటాలు, బండశెట్టిపల్లి, గ్రామాలకు సంబంధించి వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వీధి కుక్కల పట్టివేత



వీధి కుక్కలను పడుతున్న దృశ్యం

పలమనేరు: పలమనేరులోని వీధి కుక్కలను తిరుపతి అనిమల్ కేర్ ల్యాండ్ వారి ద్వారా స్థానిక మున్సిపల్ సిబ్బంది బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో 31 వీధికుక్కలను పట్టారు. వీటికి వ్యాక్సిన్, స్టెరిలైజేషన్ చేసి మళ్లీ ఇక్కడే వదిలిపెట్టనున్నట్టు వారు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం



వెన్నుపూస దెబ్బతిన్న మాధవరావు

పలమనేరు: రొంపిచర్ల మండలానికి చెందిన మాధవరావు అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై వెన్నుపూస పనిచేయక కదలలేని స్థితిలోకెళ్లాడు. ఇతను ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసి స్థానిక సర్వీస్ టు సొసైటీ నిర్వాహకులు మొరానికి చెందిన సాఫ్ట్‌వేర్ అశోక్ అల్మట్టి బాధితుని చికిత్సకోసం రూ.10,300ను ఆస్పత్రి బిల్లు కింద చెల్లించాడు.

తప్పుడు వార్తలు నమ్మొద్దు

- డీఎస్పీ ప్రభాకర్



వి.కోట: వి.కోట ప్రశాంతమైన వాతావరణంలో ఉందని, ఇలాంటి సమయంలో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు పోస్టుచేస్తున్నారని, అలాంటి వార్తలను ప్రజలు నమ్మొద్దని డీఎస్పీ ప్రభాకర్ కోరారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వి.కోటలో రెండు రోజుల క్రితం జరిగిన ఇరువర్గాల ఘర్షణపై కొంతమంది పనికట్టుకుని సోషల్ మీడియాలో అభ్యంతకర వార్తలను పోస్టు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా అధికారుల పర్యవేక్షణతో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిందన్నారు. ఇలాంటి సమయంలో కొందమంది సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను పోస్టుచేస్తున్నట్లు తాము గుర్తించామన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వసతి వెతలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

- మూడు నెలలుగా మంజూరుకాని బిల్లులు
- అప్పు చేసి విద్యార్థులకు వంట వండుతున్న వైనం
- హాస్టళ్లలో లోపించిన పారిశుధ్యం, సౌకర్యాలు అంతంత మాత్రమే
- బాత్‌రూమ్‌లకు తలుపులు కూడా లేని దుస్థితి



బాలుర హాస్టల్‌లో తలుపులు లేని టాయ్‌లెట్లు

పలమనేరు: నియోజకవర్గంలోని సంక్షేమ, గురుకుల హాస్టళ్లల్లో పారిశుధ్యం లోపించింది. అసలే వానాకాలం కావడంతో అపరిశుభ్రంగా ఉన్న హాస్టల్ల వద్ద దుర్గంధభరితమైంది. దీంతో పగలు, రాత్రి అనే తేడాలేకుండా దోమలు చుట్టుముడుతున్నాయి. మరోవైపు పిల్లలకు మంచినీటి సమస్య తప్పడం లేదు. ఫలితంగా అక్కడికక్కడ పిల్లలు జ్వరాలతో బాధపడుతున్నారు. గత ప్రభుత్వం హాస్టళ్లకు మంజూరు చేసిన వాటర్‌ప్లాంట్‌లను ఇప్పుడు వాడడం లేదు. కిటికీలకు మెస్‌లు కొట్టక, పనిచేయని ఫ్యాన్ల కారణంగా విద్యార్థులకు దోమల బెడద తప్పడం లేదు. ఇక నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం వండే నిర్వాహకులకు మూడు నెలల నుంచి బిల్లులు మంజూరుకాలేదు. దీంతో వారు వడ్డీకి అప్పులు తెచ్చి, నగలను తాకట్టు పెట్టి మరీ పిల్లలకు వంటచేస్తున్నారు. ఫలితంగా నాణ్యమైన సరుకులు, కూరగాయల మాట దేవుడెరుగు ఏపూటకాపూట వంట వండిపెడితే చాలన్నట్టు తయారైంది పరిస్థితి. ఏదేమైనా నియోజకవర్గంలోని పలు హాస్టల్లు అపరిశుభ్రంగానూ, సరైన సౌకర్యాలు లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. బడుల్లో మధ్యాహ్నభోజనం క్వాలిటీ తగ్గిందనే విషయాలు సాక్షి విజిట్‌లో తేటతెల్లమైంది.

ఇది పలమనేరులో పరిస్థితి....

- నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ, గురుకుల సంక్షేమ హాస్టళ్లు15, రెండు కస్తూరిబా పాఠశాలలున్నాయి. వీటిల్లో 3వేల మంది పిల్లలుంటున్నారు.
- వి.కోటలోని బాలుర హాస్టళ్లల్లో ఎనిమిది బాత్‌రూమ్‌లుండగా వీటిలో ఆరింటికి తలుపులు కూడా లేవు. దీంతో పిల్లలు ఆరుబయటే మలమూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. హాస్టల్ హాలు అధ్వానంగా మారింది.
- బైరెడ్డిపల్లి గురుకుల పాఠశాలలో డైనింగ్‌హాలు పెకప్పు పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో పిల్లలకు మూడు పూటలా ఆరుబయట భోజనాన్ని పెడుతున్నారు. ఇక వర్షం వస్తే వీరికి వరండాలే దిక్కు. రెగ్యులర్ టీచర్లు లేక కాంట్రాక్టు టీచర్లతో బోధన సాగుతోంది. దీంతో విద్యాబోధన ప్రమాణాలు తగ్గుముఖం పట్టినట్టు తల్లిదండ్రులు చెబుతున్నారు.
- పలమనేరు స్థానిక బాలికల హాస్టల్‌లో మూడు నుంచి పది తరగతుల దాకా 80 మంది ఉన్నారు. వీరికి తాగేందుకు మంచినీటి ఇబ్బందులున్నాయి. నిత్యం మున్సిపాలిటీ నుంచి అందే ట్యాంకర్ల నీటిని సంపులోకి నింపుకొని వాటినే పిల్లలకు అందిస్తున్నారు.
- పలమనేరులోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో 170మంది దాకా విద్యార్థులున్నారు. ఇక్కడి భోజన నిర్వాహకులకు మూడు నెలల నుంచి బిల్లులు మంజూరుకాలేదు. ఇప్పటికే లక్షదాకా వడ్డీకి అప్పులు చేసి భోజనాన్ని పెడుతున్నట్టు అక్కడి నిర్వాహకులు సిద్ధిఖా ఉబేదుల్లా తెలిపారు.





మధ్యాహ్నభోజన పరిస్థితి, వి.కోట స్కూల్‌లో కింద కూర్చుని భోజనాలు చేస్తున్న విద్యార్థినులు





జీసీ హాస్టళ్లలో విరిగిన తలుపులతో బాత్‌రూమ్‌లు





హాస్టల్లో నెలకొన్న అపరిశుభ్రం

మత్తుపదార్థాలు విక్రయిస్తే చర్యలు

గుడుపల్లి: దుకాణాల్లో మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండలంలోని పీఈఎస్ ఆడిటోరియంలో పీఈఎస్ ఆస్పత్రి సమీపంలోని దుకాణదారులతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ దుకాణాల్లో మత్తు పదార్థాలకు సంబంధించిన ఏ వస్తువులను అమ్మరాదన్నారు. దుకాణదారులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురై వ్యక్తి మృతి

చౌడేపల్లి: పాముకాటుకు గురై వ్యక్తి మృతిచెందిన సంఘటన చౌడేపల్లె మండలం చారాల కురప్పల్లెలో బుధవారం చోటుచేసుకుంది. రెడ్డెప్ప (31) టైలరింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటేసింది. అపస్మారకస్థితిలో ఉన్న అతన్ని కుటుంబీకులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటల పోటీల్లో ఉపాధ్యాయులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆటల పోటీలను నిర్వహించారు. నేడు జరిగే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించినట్టు స్థానిక ఎంఈఓ లీలారాణి తెలిపారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. ఇందులో సెకెండ్ ఎంఈఓ బాలసుందరం, హెచ్ఎం షంషీర్, పీఈటీలు అల్తాఫ్, అజయ్, సాజియా, కృష్ణవేణి పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

- కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని నూతన మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పుంగనూరులో గతంలో పనిచేసిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీని అన్నివిధాల అభివృద్ధి చేస్తామన్నారు. భవన యజమానులు పన్నులను సకాలంలో చెల్లించి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. మున్సిపాలిటీలో పారిశుధ్య కార్యక్రమాలను మెరుగుపరిచేందుకు సిబ్బందికి తగిన అవగాహన కల్పిస్తామన్నారు. అవినీతి, అక్రమాలకు ఎవరు పాల్పడినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ డీఈఈ మహేష్, ఏఈ కృష్ణకుమార్, ఆర్వో కమలాకర్, సీనియర్ అసిస్టెంట్ రమణారెడ్డి కమిషనర్‌కు స్వాగతం పలికారు.

ఆర్టీసీ డిపోను కాపాడండి సారూ!

పలమనేరు: నిర్వీర్యమైపోతున్న పలమనేరు ఆర్టీసీ డిపోను కాపాడాలని స్థానిక పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు డీపీటీఓ రామును బుధవారం విన్నవించారు. డిపోను పరిశీలించేందుకు ఆయన ఇక్కడికి రావడంతో విషయం తెలుసుకున్న వారు డిపో పరిస్థితి, కొత్త సర్వీసుల ఆవశ్యకతపై ఓ వినతిపత్రాన్ని అందించారు. స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. డీఎం టీకే స్వామి పాల్గొన్నారు. ఆయనకు విన్నవించిన వారిలో సమితి అధ్యక్ష కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు పీపీఎస్ సభ్యులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే



చందు, మంజులారాణి, వెంకటరమణయ్య, నారాయణ

పలమనేరు: పలమనేరు నియోజకవర్గానికి సంబందించి ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. వీరికి నేడు చిత్తూరు జెడ్పీ హాలులో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో అవార్డులనందించనున్నారు. ఆమేరకు సర్వశ్రీ అవార్డుకు వి.కోట మండలం ముదరందొడ్డి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బాల చైతన్య, లింగాపురానికి చెందిన ముక్కు చలపతి, జవునిపల్లి పాఠశాలకు చెందిన లక్ష్మీపతి, గోవిందాపురం ఎంపీపీ స్కూల్‌కు చెందిన హేమలత, వి.కోటకు చెందిన సునంద, పెద్దపంజాణి మండలం శ్రీరామాపురం ఉన్నత పాఠశాలకు చెందిన నారాయణ, మాడికి చెందిన రఘుపతి, బైరెడ్డిపల్లి మండలం నెల్లిపట్ల ఉన్నత పాఠశాలకు చెందిన రామారావు, గంటావూరు ఎంపీపీ స్కూల్‌కు చెందిన మంజులారాణి, బాయ్స్‌స్కూల్‌కు చెందిన వెంకటరామయ్య, బాలికోన్నత పాఠశాలకు చెందిన నారాయణ, కొలమాసనపల్లికి చెందిన చందు ఎంపికైనట్టు విద్యాశాఖ వెలువరించిన ఆదేశాల్లో తెలిపారు. వీరికి ఆయా మండలాల ఎంఈఓలు అభినందనలు తెలిపారు.

పుంగనూరు నియోజకవర్గంలో..



రాజేష్, డాక్టర్ రమ, జాఫర్‌బాషా

పుంగనూరు: పుంగనూరు రూరల్ మండలం నుంచి ఇద్దరు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అందులో అడవినాథునికుంట ఆదర్శ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీఎస్.రమను ఎంపిక చేశారు. ఈమె గతంలో కూడా ఈ అవార్డును అందుకున్నారు. అలాగే గూడూరుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఫిజిక్స్, మ్యాథ్స్ ఉపాధ్యాయుడు టీఆర్.రాజేష్‌ను ఎంపిక చేశారు. వీరికి గురుపూజోత్సవం రోజు సన్మానం చేయనున్నారు.

రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాల టీచర్ జాఫర్‌బాషా ఉత్తమ టీచర్‌గా ఎంపికైనట్లు ఎంఈఓ శ్రీనివాసులు ఈసందర్భంగా బుధవారం తెలిపారు.


ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



పోటీ పడుతున్న ఉపాధ్యాయులు

రొంపిచెర్ల: సర్వేపల్లె రాధాకృష్ణ పుట్టినరోజు పుర్కరించుకుని రొంపిచెర్ల మార్కెట్ యార్డులో ఉపాధ్యాయులకు ఆటల పోటీలను బుధవారం నిర్వహించారు. మండలంలో ప్రాథమిక, యూపీ పాఠశాలలకు చెందిన 55 మంది ఉపాధ్యాయులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన 30 మంది ఉపాధ్యాయులకు బహుమతులను రొంపిచెర్ల తెలుగు ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రదానం చేయనున్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ

బైరెడ్డిపల్లి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం బాగా తీసుకోవడం వలన ఆరోగ్యవంతంగా ఉంటారని సీడీపీఓ మాధవిలత అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నెల్లిపట్ల సచివాలయ పరిధిలోని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కౌమారదశ నుంచే ఆడపిల్లలకు రక్తహీనత రాకుండా ఉండేందుకు పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐరన్, ఫోలిక్ యాసిడ్ సిరప్‌లను అందిస్తున్నట్లు చెప్పారు. సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం



దాడులు చేస్తున్న పోలీసులు

సదుం: మండలంలోని చీకలచేను పరిసర ప్రాంతాల్లోని సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ షెక్షావలి బుధవారం తెలిపారు. గాదేవారిపల్లె సమీపంలో సారా తయారీ స్థావరంలో 500 లీటర్ల సారా ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పోలీస్‌స్టేషన్‌కు సీసీ కెమెరాల విరాళం



సాయినగర్ వద్ద సీసీ కెమెరా

గంగవరం: గంగవరం పోలీస్‌స్టేషన్‌కు సీసీ కెమెరాలను కొంతమంది దాతలు విరాళంగా అందించినట్టు సీఐ ప్రసాద్ తెలిపారు. పటిష్టమైన నిఘా వ్యవస్థలో భాగంగా మండలంలో నేరాలు జరక్కుండా అరికట్టేందుకుగానూ సీసీ కెమెరాలను రహదారుల్లోని ముఖ్యమైన కూడళ్లలో బుధువారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి వీడియో రికార్డింగ్ సిస్టమ్‌ను పోలీస్‌స్టేషన్‌లో అమర్చామని ఎక్కడ ఏమి జరిగినా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ప్రత్యామ్నాయ పంటగా ఉలవ



మాట్లాడుతున్న నాగపద్మిణి

గంగవరం: వేరుశనగ వేయని రైతులు ప్రత్యామ్నాయపంటగా ఉలవలు వేసుకునేందుకు మంచి అవకాశమని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు నాగపద్మిని తెలిపారు. మండలంలోని దండపల్లి గ్రామం రైతు సేవా కేంద్రంలో రైతులతో బుధువారం ఆమె సమావేశం నిర్వహించారు. వరి, వేరుశనగ లాంటి వివిధ పంటల యాజమాన్య పద్ధతులను వివరించారు. అలాగే 80 శాతం సబ్సిడీ ధరతో ఉలవలను రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం వరి, వేరుశనగ పంటలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు తెలియజేశారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త సంధ్యారాణి, సర్పంచ్ బీరుగౌడ్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలను పెంపొందించాలి

- ఉపాధ్యాయులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ



పాఠశాలలో పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్

గంగవరం: విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండలంలోని మల్లేరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం తనిఖీ చేసి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆదిశగా ఉపాధ్యాయులు సైతం మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలను సూచించారు. పాఠాలు బోధించడం ఉపాధ్యాయులు వరంగా భావిస్తే ప్రతి విద్యార్థి మీరు నేర్పిన పాఠాలు వరంగా స్వీకరించి జీవితకాలం గుర్తుపెట్టుకున్నారన్నారు. విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బియ్యం పంపిణీ పరిశీలన..

ప్రాథమిక పాఠశాల తనిఖీ అనంతరం ఇదే గ్రామంలో రేషన్ కార్డుదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా ఎండీయూ వాహనాల ద్వారా జరుగుతున్న బియ్యం పంపిణీని కలెక్టర్ తనిఖీ చేశారు. కార్డుదారులతో మాట్లాడుతూ రేషన్ సకాలంలో అందుతుందా లేదా అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు.

ఫీజు కట్టలేదని ఇంటికి పంపారు

- స్కూల్ వద్ద నిరసనకు దిగిన తండ్రి
- ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఎంఈఓ సూచన



ప్రైవేట్ స్కూల్ వద్ద పిల్లలతో కలసి నిరసన తెలుపుతున్న తండ్రి

పలమనేరు: ప్రైవేటు పాఠశాలకు సంబంధించి ఫీజు చెల్లించలేదని యాజమాన్యం చిన్నారులను బయటికి పంపేసిన సంఘటన బుధవారం పలమనేరులో చోటుచేసుకుంది. తావడపల్లికి చెందిన ప్రభాకర్ కుమార్తె, కుమారులు పలమనేరులోని గుడియాత్తం రోడ్డులో ఉన్న ఓ ప్రయివేట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఎల్‌కేజీ, మొదటి తరగతి చదువుతున్నారు. వీరు బడి తెరిచినప్పటినుంచి ఫీజు కట్టకపోవడంతో యాజమాన్యం బుధవారం పిల్లలను బయటికి పంపింది. పాఠశాలకు వద్దకు చేరుకుని విద్యార్థుల తండ్రి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను, తన భార్య నిరుద్యోగులమని తాము డీఎస్సీకి ఇంట్లోనే ప్రిపేర్ అవుతున్నందున తమ వద్ద ఫీజు కట్టేందుకు డబ్బు లేదన్నారు. ఈ విషయం స్కూల్ హెచ్ఎంకు సైతం చెప్పానని, అప్పు చేసైనా పిల్లలకు ఫీజు కడతామని అనుకుని వచ్చేసరికి ఇలా పుస్తకాల సంచితో పిల్లలను బయటకు పంపడం చూసి కడుపు కాలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దీనిపై విచారణ చేయాలని ఇక్కడి ఎంఈఓ లీలారాణిని ఆదేశించారు. దీనిపై స్పందించిన ఆమె విచారించగా స్కూల్‌లో ఫీజు కట్టని మాట నిజమేనన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించమని ఎంఈఓ తల్లిదండ్రులకు సూచించారు.

సబ్సిడీపై ఉలవల పంపిణీ

శాంతిపురం: సబ్సిడీపై రైతులకు కావాల్సిన ఉలవల పంపిణీని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బుధవారం రాళ్లబూదుగూరులో ప్రారంభించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం విత్తనాలు, ఎరువులను అందించడానికి ప్రభుత్వం సిద్ధగా ఉందని ఆయన చెప్పారు. మండల వ్యవసాయాధికారి అప్పోజి, నేతలు పీఎస్ మునిరత్నం, విశ్వనాథనాయుడు, సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: ప్రభుత్వం రైతులకు ఇస్తున్న సబ్సిడీ ఉలవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి అన్నారు. ఆమె బుధవారం బొమ్మయ్యగారిపల్లె రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ ఉలవ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 80 శాతం సబ్సిడీతో ఉలవలు ఇస్తున్నామని తెలిపారు. నేతలు ఊయల రమణ, ఓబులేశ్వరరెడ్డి, మహేష్, రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలు నర్మద, సుజాత, వెంకటరమణ నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉలవల పంపిణీ

సదుం: సబ్సిడీపై ఉలవలను గురువారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఏఓ హరిప్రసాద్ తెలిపారు. 11 రైతు సేవా కేంద్రాల్లో 102 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కేజీకి రూ.17.40 చెల్లించాలని తెలియజేశారు.

వి.కోట..

వి.కోట: నేటి నుంచి ప్రభుత్వం సబ్సిడీ ధరలతో ఉలవలను మండలంలో రైతులకు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి రాజ్యలక్ష్మి బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ వేరుశనగ సాగు చేయకుండా మిగిలిన విస్తీర్ణంలో ప్రత్యామ్నాయంగా ఉలవలు సాగు చేయవచ్చన్నారు.